
సాక్షి
తిరుపతి

సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025

● అలిపిరిలో షికారు!



తిరుపతిలోని అలిపిరి భద్రతా కేంద్రం నుంచి గరుడ సర్కిల్ వరకు ఆదివారం కార్లతో నిండిపోయింది. సెలవు రోజులు కావడంతో ఉదయం నుంచే శ్రీవారి దర్శనానికి భక్తులు తండోపతండాలుగా తరలిరావడం కనిపించింది.
– మోహనకృష్ణ కేతారి, సాక్షి ఫొటో గ్రాఫర్, తిరుపతి

న్యూస్‌రీల్

అలిపిరి టోల్‌గేట్ వద్ద అదనపు ఈఓ తనిఖీ



సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు ఈఓ

తిరుమల : అలిపిరి టోల్‌గేట్ వద్ద టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా వాహనాల చెకింగ్ పాయింట్ వద్ద చేపట్టిన భద్రతా చర్యలను అడిగి తెలుసుకున్నారు. కొద్ది రోజులుగా ఫాస్ట్ ట్యాగ్ సిస్టమ్ ఎందుకు పనిచేయడం లేదని ఆరా తీశారు. వాహనాల టోల్ ఫీజు కౌంటర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

24 నుంచి దూర విద్య పరీక్షలు



ఎస్వీయూలోని డీడీఈ భవనం

తిరుపతి సిటీ : ఎస్వీయూ దూర విద్య పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ మేరకు ఈనెల 24వ తేదీ నుంచి యూజీ, పీజీ పరీక్షలను ఎస్వీయూ పరిధిలోని సుమారు 43 కేంద్రాలలో నిర్వహించనున్నారు. సుమారు 32వేల మందికిపైగా హాజరుకానున్న దూర విద్య పరీక్షలు సీసీ కెమెరాల నిఘాలో పకడ్బందీగా నిర్వహించాలని విద్యార్థి సంఘాల నేతలు కోరుతున్నారు. ఈ క్రమంలోనే ఎంబీఏ తొలి ఏడాది పరీక్షలను మార్చి 8వ తేదీ నుంచి నిర్వహించనున్నారు.

సమస్యలు పరిష్కరించరూ!

- 20 రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదు
- మంత్రి లోకేష్‌కు వెటర్నరీ విద్యార్థుల వినతి

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : నెల్లూరు జిల్లా పర్యటన నిమిత్తం ఆదివారం రేణిగుంట విమానాశ్రయానికి వచ్చిన మంత్రి నారా లోకేష్‌ను సుమారు 200 మంది వెటర్నరీ విద్యార్థులు కలిశారు. గౌరవ వేతనం పెంపు కోసం సుమారు 20 రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని, ఇతర విభాగాల వైద్య విద్యార్థులతో సమానంగా స్టయిఫండ్ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందించారు. మంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సేవలు దూరం.. భరోసా మాయం!

ఆర్‌బీకేలను నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వం

- రైతు సేవా కేంద్రాల రేషనలైజేషన్‌కు ఆదేశం
- 2 వేల ఎకరాలకు ఒక సెంటర్ కొనసాగించాలని నిర్ణయం
- ఎరువులు.. విత్తనాల కోసం ఇబ్బందులు ఎదుర్కోనున్న రైతాంగం



గూడురులోని తిప్పవరప్పాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రం

తిరుపతి అర్బన్ : జిల్లాలో మొత్తం 774 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అలాగే 445 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీటిని రేషన్‌లైజేషన్ పేరుతో 2వేల ఎకరాలు ఉండే గ్రామాల్లోనే రైతు సేవా కేంద్రాలను మాత్రమే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియ పూర్తయితే జిల్లాలో 75 నుంచి 80 రైతు సేవా కేంద్రాలు మాత్రమే మిగులుతాయి. అంటే పది పంచాయతీలకు ఒక్కటి మాత్రమే ఉంటుంది. ఈ క్రమంలో ఎరువులు, విత్తనాలతోపాటు ఇతర వస్తువులను రైతు సేవా కేంద్రాల్లో తెచ్చుకునేందుకు నానా తిప్పలు పడాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో మాదిరిగా దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రవాణా ఖర్చులు తడిసిమోపెడవుతాయని వాపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కడుపులో చల్ల కదలకుండా సొంత ఊరిలోనే సాగుకు అవసరమైనవన్నీ తెచ్చుకున్నామని, మళ్లీ ఇబ్బందులు తప్పేలా లేవని నిస్పృహ చెందుతున్నారు.

అన్నదాతలకు కూటమి ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోంది. వ్యవసాయరంగంపై శీతకన్ను వేస్తోంది. ఈ క్రమంలోనే సేద్యానికి చేదోడుగా నిలిచిన రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందనే సాకుతో ఆర్‌బీకేలను అదృశ్యం చేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో తొలుత రైతు సేవా కేంద్రాలను తీసుకువచ్చామంటూ ఊదరగొట్టింది. సకాలంలో విత్తనాలు.. ఎరువులు అందించకుండా రైతాంగానికి తీరని ద్రోహం చేస్తోంది. క్రమేణా రేషనలైజేషన్ పేరుతో ఉన్న వాటిని కుదించేందుకు పన్నాగాలు పన్నుతోంది. ఏది ఏమైనా వ్యవసాయాన్ని దండగలా మార్చేందుకు విశ్వప్రయత్నం చేస్తోంది.

నాడు : అన్నదాతల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2020లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. రాయితీ విత్తనాలు, ఎరువులు, పంటల సాగుకు అవసరమైన సలహాలు, ఈకేవైసీ, ఈ–క్రాప్ నమోదు, ధాన్యం కొనుగోలు, పశువులకు దాణా సరఫరా, రొయ్యలు సాగుకు చేయూతనందించేలా ఆర్‌బీకేలను తీర్చిదిద్దింది. ఈ క్రమంలో లక్షలాది మంది రైతులకు స్వగ్రామాల్లోనే విశేష సేవలందించింది.

నేడు : కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా కేంద్రాలను....రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసింది. ఆ తర్వాత రాయితీ విత్తనాలు ఇవ్వడం మానేసింది. సబ్సిడీపై ఎరువులను తూతూ మంత్రంగా అందించింది. అది కూడా రైతు సేవా కేంద్రాల నుంచి కాకుండా అధికశాతం ఎరువులను సింగిల్ విండోల ద్వారా విక్రయించింది. తాజాగా రేషనలైజేషన్ పేరుతో రైతు సేవా కేంద్రాలను తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. లక్షలాది మంది రైతులను ఇబ్బంది పెట్టేందుకు యత్నిస్తోంది.



నాగలాపురం మండలం కట్టకాడు ఆర్‌బీకే నుంచి ఎరువులు తీసుకెళుతున్న రైతులు(ఫైల్)

జిల్లా సమాచారం

మొత్తం గ్రామ పంచాయతీలు	774
మొత్తం రైతులు	3.10 లక్షలు
సాధారణ పంటల విస్తీర్ణం	2.45 లక్షల ఎకరాలు
ఉద్యాన పంటలు	95 వేల ఎకరాలు
రైతు సేవాకేంద్రాలు	445

వ్యతిరేకత తప్పదు



రైతు సేవా కేంద్రాలను ఇదే విధంగా కొనసాగించాలి. వీటితో రైతులకు ఎంతో ప్రయోజనం ఉంది. ప్రధానంగా విత్తనాలు, ఎరువులను మా గ్రామంలోనే పొందే అవకాశం ఉంటుంది. సాగుకు అవసరమైన సలహాలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారు. వ్యవసాయానికి వెన్నుదన్నుగా ఉంటే రైతు సేవా కేంద్రాలను తగ్గిస్తే ప్రభుత్వంపై వ్యతిరేకత తప్పదు. ఈ విషయాన్ని పాలకులు గమనించాలి.
– సర్వేపల్లి సురేష్, సుబ్రమణ్యం గ్రామం, బాలాయపల్లె మండలం

అన్నదాతలకు శాపం



రైతు సేవా కేంద్రాల కుదింపు అంటే అన్నదాతలకు శాపమే. ఏ సమస్య వచ్చినా వెంటనే గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రానికి వెళుతున్నాం. అక్కడ పనిచేస్తున్నఅగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించి సలహాలు తీసుకుంటున్నాం. లేదంటే మండల కేంద్రానికి వెళ్లి ఏఓను కలవాల్సి వచ్చేది. ఇప్పుడు సేవా కేంద్రాలను తీసేస్తే మాలాంటి చిన్న రైతులపైనే భారం పడుతుంది.
– ఏలుమలై, రైతు, కాట్టకాడు, నాగలాపురం మండలం

ఇది మంచిది కాదు



కూటమి సర్కార్ రైతులకు అన్యాయం చేసేందుకు యత్నిస్తుందనే అనుమానం వస్తోంది. వ్యవసాయానికి అన్ని విధాలుగా ఉపయోగపడే రైతు సేవాకేంద్రాలను తగ్గించడం సరికాదు. ఇది రాష్ట్రానికి కూడా మంచిది కాదు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు మళ్లీ కష్టాలు వస్తాయి. ఉన్న వాటిని అలాగే కొనసాగించాలి. లేకుంటే రైతుల నిరసన ఎదుర్కోవాల్సి వస్తుంది.
– సైదాపల్లి శంకరయ్య, రైతు, పురిటిపాళెం, గూడూరు రూరల్

కొనసాగించాలి



రైతు సేవా కేంద్రాలను కూటమి సర్కార్ కొనసాగించాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు వాటికి పేరు మార్చారు. అయినా పర్వాలేదు మాకు ఎలాంటి ఇబ్బంది లేదు. అయితే ఉన్న వాటిని తగ్గించేస్తే రైతులకు అవస్థలు తప్పవు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటే మంచిది.
– కోట్లపూడి శ్రీనివాసులు, రైతు, కాశీపురం, వాకాడు మండలం

ఎరువుల పరిస్థితి ఏంటి?



రైతు సేవా కేంద్రాలను ఎత్తివేస్తే ఎరువుల పరిస్థితి ఏంటి. ప్రధానంగా రైతులకు కావాల్సింది ఎరువులే. వాటి కోసమే రైతు సేవాకేంద్రాలపై ఆధారపడుతున్నాం. ఇప్పుడు ఒక్కో గ్రామానికి ఒక్కో కేంద్రం ఉంటేనే ఎరువులను అందించడం కష్టంగా ఉంటోంది. పది గ్రామాలకు ఒక్కటి ఉంటే ఇక అంతే సంగతులు. ఉన్నవాటిని కొనసాగించాలి.
–కృష్ణయ్య, రైతు, మొలగనూరు, వాకాడు మండలం

ఒక్కరు మాత్రమే పనిచేస్తున్నారు



రైతు సేవాకేంద్రాల్లో ఇప్పుడు సక్రమంగా సిబ్బంది కూడా లేరు. ఒక్క అగ్రికల్చర్ అసిస్టెంట్ మాత్రమే పనిచేస్తున్నారు. ఇప్పుడు ఈ కేంద్రాలను తగ్గిస్తే ఆయన కూడా వేరే ప్రాంతానికి వెళ్లిపోతారు. అప్పుడు మాకు కనీసం సలహా ఇచ్చే దిక్కు కూడా ఉండదు. వైఎస్సార్‌సీపీ మీద కక్షను రైతులపై తీర్చుకోవడం సరికాదు.
– అనంద్, రైతు, కేఎన్‌పేట, సత్యవేడు మండలం

కక్ష సాధింపు సరి కాదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై కక్షతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాలాంటి చిన్న రైతుల పొట్టకొట్టడం సరి కాదు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో ఆలోచించి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిని నిర్వీర్యం చేయాలనే కూటమి సర్కార్ కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. అది మంచి నిర్ణయం కాదు.
– జగదీష్, రైతు, మిట్టకండ్రిగ, వరదయ్యపాళెం మండలం

మీటింగ్‌ల పేరిట వేధిస్తే సహించం



మురళీకృష్ణ, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

శ్రీకాళహస్తి: కస్టర్ కాంప్లెక్స్ మీటింగ్‌ల పేరిట ఉపాధ్యాయులను వేధిస్తే సహించే ప్రసక్తే లేదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సరైన ప్రణాళిక లేకుండా సమావేశాలు నిర్వహించి టీచర్లను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. జిల్లాలో రెండు మూడు ఉన్నత పాఠశాలల్లోనే ఇంటర్‌నెట్ సదుపాయం ఉందని తెలిపారు. ఈ క్రమంలో మీటింగ్ హాజరైన అతికొద్ది మంది పాఠశాల సహాయకులను ఏడు గ్రూపులుగా విభజించడం వల్ల చర్చకు అవకాశం ఉండదని వెల్లడించారు. ఈ క్రమంలో సమావేశాలకు సంబంధించి లోపాలను వెంటనే సరి చేయాలని సూచించారు.

సర్వ దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో రద్దీ సాధారణంగా ఉంది. టీటీడీ అధికారుల సమాచారం మేరకు స్వామివారి సర్వదర్శనానికి 14 గంటల సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం 16 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచిఉన్నారు. ఆదివారం 78,873 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా 30,065 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.85 కోట్లుగా అధికారులు తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా లక్ష్యాల సాధన



ఎక్స్ వక్తలతో ఐఐటీ అధికారులు, సిబ్బంది

- ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ

రేణిగుంట(ఏర్పేడు): జ్ఞానం, వివేచనలతో నూతన ఆవిష్కరణలు సాధ్యమని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ అన్నారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో ఆదివారం ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెన్ సత్యనారాయణ అధ్యక్షతన 'టెడ్–ఎక్స్' నుంచి నిపుణులతో చర్చాగోష్టి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెడ్–ఎక్స్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఆవిష్కరణ, జ్ఞానాన్ని పంచుకోవడానికి వేదికగా మారిందన్నారు. టెడ్–ఎక్స్ వక్త డాక్టర్ మారల్ యాజర్లూ మాట్లాడుతూ అనుకున్న లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలన్నారు. డాక్టర్ ధృవ్ చౌహాన్ మాట్లాడుతూ విశ్వం సహజ శాంతిస్థితి, మానవత్వం సృష్టించిన గందరగోళాల మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. ఈఎస్‌డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు పియూష్ సోమని, శివ్ వాట్స్, తనూజైన్ వంటి వక్తలు కొత్త అవకాశాలను అన్వేషించడాన్ని ప్రోత్సహిస్తూ ప్రేరణాత్మకంగా మాట్లాడారు.



మాట్లాడుతున్న తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ

'ఇది బార్ కాదు. తిరుపతి–రేణిగుంట దారిలో దాదాపు అర ఎకరా స్థలంలో దర్జాగా నిర్మించిన మద్యం దుకాణం పర్మిట్ గది. నిత్యం మద్యం ప్రియులతో కళకళ్లాడే ఈ ఒక్క దుకాణం వద్దే రోజుకు రూ.20 లక్షల వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఇక పర్మిట్ గదిలో డిస్పోజబుల్ గ్లాసు నుంచి కూల్ డ్రింక్, ముక్క, ఇతర సైడ్ డిష్ వ్యాపారం రూ.లక్ష వరకు జరుగుతోంది. అధికారులకు అన్నీ తెలిసినా మౌనంగా ఉండేందుకు ఈ ఒక్క దుకాణం నుంచే నెలకు రూ.లక్ష వరకు మామూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.'



తిరుపతిలోని వైఎస్సార్ మార్గ్‌లోని ఓ వైన్‌షాప్ పక్కన నిర్వహిస్తున్న పర్మిట్ రూమ్

జిల్లాలో మద్యం దుకాణాలు - పర్మిట్ గదుల్లో మామూళ్ల

జిల్లాలోని మద్యం దుకాణాలు	227
అనుమతుల్లేని పర్మిట్ గదులు	680
మద్యం విక్రయాలు (నెలకు)	రూ.340 కోట్లు
పర్మిట్ గదుల్లో వ్యాపారం(నెలకు)	రూ.20.40 కోట్లు
మొత్తంగా వచ్చే లాభాలు(నెలకు)	రూ.52.50 కోట్లు
అధికారులకు ఇస్తున్న మామూళ్లు	రూ.72 లక్షలు
కూటమి నేతలకు ఇచ్చే వాటా	రూ.23 కోట్లు

పర్మినెంట్ కిక్కు!

- మద్యం దుకాణాల పక్కన అనధికార పర్మిట్ గదులు
- అధికారుల ఆదేశాలతోనే అనుమతులు
- అదనపు ఆదాయంలో ఎక్సైజ్.. ఖాకీలకు వాటాలు
- ఆపై కూటమి నేతలకు సగటున 7 శాతం మామూళ్లు
- చంద్రగిరి నుంచి గూడూరు వరకు 'మద్యం' గదుల్లో దందా

చిత్తూరు అర్బన్: పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరునగరిలో 24 గంటల పాటు మద్యం దొరికే దుకాణాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఇక తమిళనాడుకు సరిహద్దులో ఉన్న సూళ్లూరుపేట నుంచి నెల్లూరు జిల్లాకు విస్తరించి ఉన్న గూడూరు, చిత్తూరు జిల్లాను ఆనుకుని ఉన్న చంద్రగిరి నియోజకవర్గాల వరకు 227 మద్యం దుకాణాలున్నాయి. ఒక్కో దుకాణాన్ని ఆనుకుని సగటున మూడు పర్మిట్ గదులు వెలిశాయి. మద్యం దుకాణాలపై ఆధారపడ్డ కూటమి నేతల నుంచి ఎక్సైజ్ అధికారులు, ఖాకీలకు నిబంధనలు ఏమీ పట్టడం లేదు. అందుకే ఏ ఒక్క మద్యం దుకాణం చూసినా, పక్కనే మందుబాబులు మద్యం సేవించడానికి మూడు నుంచి నాలుగు పర్మిట్ గదులకు అనుమతులు ఇచ్చేశారు. అచ్చం బారుకు ఏమాత్రం తీసిపోకుండా వీటిని ఏర్పాటు చేసుకున్నారు.



తిరుపతిలోని కరకంబాడి రోడ్డులో..

వసూలు చేస్తూ.. అనుమతిస్తూ!

తిరుపతిలోని లీలామహల్ కూడలి, డీబీఆర్ ఆస్పత్రి రోడ్డు, పద్మావతిపురం, తిరుచానూరు, తనపల్లె, చంద్రగిరిలోని జూపార్కు రోడ్డు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేటలోని తమిళనాడు బోర్డర్ దుకాణాల్లో రోజుకు రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతోంది. నిత్యం మందుబాబులతో కిటకిటలాడుతున్న ఈ దుకాణాల్లో సగటున ఒక్కో పర్మిట్ గదిలో రూ.50 వేల వరకు వ్యాపారాలు జరుగుతున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో రూ.20 వేల వరకు వ్యాపారం జరుగుతోంది. మద్యం దుకాణాలతో పాటు జిల్లాలోని పర్మిట్ గదుల వద్ద జరిగే వ్యాపారాల నుంచి నెలకు రూ.52 కోట్లకు పైగా లాభాలు వస్తున్నాయి. నిర్వాహకులు ఇచ్చే మామూళ్లలో అటు కూటమి నేతలు, ఇటు అధికార యంత్రాంగం మునిగితేలుతున్నారు.

ఎవరి వాటా వాళ్లదే!

పర్మిట్ గదులు వెలసినచోట.. మరే వ్యాపారం చేయడానికి వీలుండదు. మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు నిత్యం గొడవలు పడడం, తాగి అక్కడే వాంతులు చేసుకోవడం, పడిపోవడం సర్వసాధారణం. ప్రతీ పర్మిట్ గదికి ఎక్సైజ్, ఖాకీలు కప్పం వసూలు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రతీ దుకాణ నిర్వాహకుడి నుంచి రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇందులో ఒక్క పోలీసులకే రూ.30 వేల నుంచి రూ.20 వేల వరకు పంచుతున్నట్టు తెలుస్తోంది. పల్లెల్లోని దుకాణాలకు కాస్త మినహాయింపు ఇస్తూ, రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇదికాదన్నట్టు మద్యం దుకాణాలున్న నియోజకవర్గంలో వాటి యజమానులు ఇష్టం ఉన్నా, లేకున్నా కూటమి నేతలను వాటాదారుడిగా చేర్చుకోవాల్సిందే. వ్యాపారంలో ఎలాంటి పెట్టుబడి పెట్టని కూటమి నేతలు 5 నుంచి 7 శాతం వరకు.. అంటే నెలకు రూ.23కోట్ల పైనే లాభాలు ఆర్జిస్తున్నారు. ఆ మాత్రం కిక్కులేకుంటే కష్టమే మరి.



సూళ్లూరుపేటలో..

● కోడి వెలవెల.. మీనం మిలమిల



తిరుపతి చేపల మార్కెట్‌లో కిక్కిరిసిన జనం

బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ ప్రియులు బెంబేలెత్తుతున్నారు. వెటర్నరీ అధికారులు భరోసా ఇస్తున్నా.. కోడి జోలికి వెళ్లేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం చేపల కొనుగోలుకు పోటెత్తారు.దుకాణాల ఎదుట బారులుతీరారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



తిరుపతిలో కొనేవాళ్లు లేక ఖాళీగా చికెన్ షాపు

క్లుప్తంగా

నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్'

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. గ్రీవెన్స్‌కు అన్నిశాఖ ఉన్నతాధికారులు హాజరై ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నారు.

ఎస్పీ కార్యాలయంలో రద్దు

తిరుపతి నగరంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు అధికారులు ఆదివారం వెల్లడించారు. సమస్యలపై ఫిర్యాదులు చేయాల్సిన వారు ఆయా పోలీస్‌స్టేషన్‌లలో అందించాలని సూచించారు.

ఘనంగా బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక


మాట్లాడుతున్న వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి

తిరుపతి కల్చరల్ : తిరుపతి బైరాగిపట్టెడలోని వైఖానస కల్యాణ మండపంలో బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, ఎస్వీ వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి హాజరయ్యారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సమాజం కార్యదర్శి అజయ్‌కుమార్, కామేశ్వర ప్రసాద్ రావు, ఎంఎస్‌కే ప్రసాద్, వెంకట పెరుమాళ్, భీమాస్ అశోక్, వాసుదేవరావు, వెంకట నాగరాజు, చక్రవర్తి రాఘవన్, గంగాధర్‌రావు, శంకర్ పాల్గొన్నారు.

శివ శివా.. తిప్పలు తప్పవా?


ఆర్చి నిర్మాణానికి ఇప్పుడు ఇసుక తోలారు.. ఎప్పటికి పూర్తి చేస్తారో?

శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లు నత్తనడకన సాగుతున్నాయి. ఆలయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలోపంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీఐపీల సేవలో తరించేందుకే ఆహ్వానం పత్రికలతో పరుగులు తీస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆధ్యాత్మిక వేత్తలు.. పీఠాధిపతులతో సమానంగా రాజకీయ.. సినీ ప్రముఖులకు ప్రాధాన్యమివ్వడంపై పలువురు మండిపడుతున్నారు. అలాగే ఆలయానికి ఇతోధికంగా చేయూతనందించిన దాతలను విస్మరించడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- అసంపూర్తిగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లు
- వీఐపీల ఆహ్వానంలో నిమగ్నమైన ప్రజాప్రతినిధులు, అధికారులు
- నత్తనడకన సాగుతున్న అభివృద్ధి పనులు

శ్రీకాళహస్తి : ముక్కంటి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్సవ ఏర్పాట్లు ఇప్పటికీ పూర్తి కాలేదు. పాలకులు, అధికారులు, సిబ్బంది కేవలం వీఐపీలకు ఆహ్వాన పత్రికలను అందించడానికే పరిమితమయ్యారు. సామాన్య, మధ్య తరగతి భక్తులకు వసతులు కల్పించడంపై శీతకన్ను వేశారు. గత 10 రోజులుగా రాజకీయ నాయకులు, సినిమా వారిని ఆహ్వానించేందుకే ప్రజాప్రతినిధులు, అధికారుల సమయం గడచిపోతోంది.

కనిపించని పోస్టర్లు

గతంలో మహాశివరాత్రికి 15రోజుల ముందే బ్రహ్మోత్సవ పోస్టర్లు విడుదల చేసేవారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పట్టణాల్లో అతికించేవారు. ఉత్సవ వివరాలను సామాన్య భక్తులకు తెలిసేలా చర్యలు చేపట్టేవారు. అయితే ఈ ఏడాది పోస్టర్ల ఊసే శ్రీకాళహస్తీశ్వరాలయంలో కనిపించడంలేదు. అలాగే ఆహ్వాన పత్రికలను మొదటగా పీఠాధిపతులను అందించేవారు. అయితే ఈ ఏడాది మీడియాకు విడుదల చేశారు. అనంతరం రాజకీయ నేతలకు అందజేశారు.

కదలని పనులు

ఆలయం చుట్టు పక్కల కాలువలు, ప్రహరీ గోడలు వంటి పనుల నత్తనడకన జరుగుతున్నాయి. నాలుగురోజుల్లో శివరాత్రి ఉత్సవాల ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటి వరకు పూర్తయిన పనులు చూస్తుంటే అధికారుల నిర్లక్ష్యం అర్థమవుతోంది. అలాగే భక్తులకు వసతి గదులు కేటాయించే సీఆర్‌ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయలేదు. ఆ పనులు సైతం సాగుతూనే ఉన్నాయి. అలాగే ఆలయ ప్రహరీగోడలకు, స్వర్ణముఖి నదిలో రంగుల వేసే పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఎప్పటికీ పూర్తి చేస్తారో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. సంవత్సరానికి ఒకసారి వచ్చే మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి గోపురాలపై ఉండే పిచ్చిమొక్కలను తొలగించకపోవడంతో పట్టణవాసులు మండిపడుతున్నారు. అలాగే ఆలయ ఆవరణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టలేదు. ఆయా కేంద్రాలను అపోలో సంస్థ నిర్వహిస్తుందని గొప్పగా ప్రకటించిన అధికారులు ఆ దిశగా సన్నాహాలు చేయడం లేదు.

నదిలోనే పార్కింగ్

గతంలో స్వర్ణముఖి నదిలో పార్కింగ్ ఏర్పాటు చేస్తే నేటి కూటమి నేతలే అప్పుడు విమర్శలు గుప్పించారు. వరదలు వస్తే ఏంచేస్తారంటూ ఇష్టారీతిన మాట్లాడారు. అయితే ప్రస్తుతం నదిలో రోడ్డు వేసి పార్కింగ్ ఏర్పాటు చేశారు. వాహనాలను సైతం స్వర్ణముఖి నదిలోకి పంపుతున్నారు. రివర్‌వ్యూ వద్ద నుంచి రామసేతు వంతెన వరకు ఉన్న రోడ్డును వినియోగించే వీలు లేకుండా ఆర్చీ నిర్మాణ పనులను ఇపుడు ప్రారంభించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బ్రహ్మోత్సవాల సమయంలో ఆ రోడ్డు ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగపడేది. అయితే ఆర్చీ నిర్మాణం నత్తనడకన సాగుతుండడంపై పలువురు మండిపడుతున్నారు.


ప్రహరీ గోడ, కాలువ, రోడ్డు నిర్మాణ పనుల పరిస్థితి ఇదీ..


స్వర్ణముఖి నదిలో ఏర్పాటుచేసిన కారు పార్కింగ్

కారు బోల్తా


ప్రమాదానికి గురైన కారు

వరదయ్యపాళెం: మండలంలోని యానాదివెట్టు వద్ద ఆదివారం ఓ కారు అదుపు తప్పి బోల్తా పడింది. గ్యాస్ పైపులైన్ కోసం తీసిన గుంతల్లో దిగడంతో కారు టైర్లు ఊడిపడ్డాయి. దీంతో వాహనం పల్టీలు కొట్టి పొదల్లోకి దూసుకెళ్లింది. అయితే కారులో ప్రయాణిస్తున్నవారు క్షేమంగా బయటపడడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

బీసీ రుణాలకు వెల్లువెత్తిన దరఖాస్తులు


దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

తిరుపతి తుడా: బీసీ కార్పొరేషన్, స్వయం సహాయక రుణాల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆదివారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం దరఖాస్తు దారులతో కిక్కిరిసింది. బీసీ రుణాల కింద తిరుపతి నియోజకవర్గానికి కేవలం 170 యూనిట్లు మాత్రమే ప్రభుత్వం కేటాయించింది. 170 యూనిట్లకు గాను 2,690 మంది దరఖాస్తు చేసుకున్నారు. గతంలో రూ.10 లక్షలకు పైగా యూనిట్ విలువ ఉండేది. అయితే ప్రస్తుతం 170 యూనిట్లలో రూ.2లక్షల రుణాలే అధికంగా ఉన్నాయి. రూ.5 లక్షలు , రూ.7.50 లక్షల రుణాలు తక్కువ సంఖ్యకే పరిమితమయ్యాయి. దీనిపై దరఖాస్తుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సామాన్యభక్తులకే పెద్దపీట


మంత్రి అనితకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగే మహాశివరాత్రికి సామాన్య భక్తులకే పెద్దపీట వేస్తామని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం ఆలయ పరిపాలనా భవనంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై పలుశాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు జరిగే ముక్కంటి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా సంతృప్తికరంగా దర్శనం చేసుకునేలా అధికారులు పనిచేయాలన్నారు. ఈ నెల 25న సీఎం చంద్రబాబు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదంతో పాటు వాటర్ బాటిల్‌ను అందజేస్తామన్నారు. స్థానికులకు టిక్కెట్లు లేకుండా ప్రత్యేక ఉచిత దర్శనం అవకాశాన్ని కల్పిస్తామని చెప్పారు. అంతకుముందు హోంమంత్రి అనితకు దక్షిణ గోపురం వద్ద వేదపండితులు స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆమెను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈవో బాపిరెడ్డి, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాములు పట్టడంపై అవగాహన


పాముల పట్టడంపై అవగాహన కల్పిస్తున్న ట్రైనర్స్

తిరుపతి మంగళం : శ్రీవేంకటేశ్వర జంతుప్రదర్శనశాల (ఎస్వీజూపార్క్)లో ఆదివారం మద్రాసు క్రోకోడైల్ బ్యాంక్ ట్రస్ట్, సంఘమిత్ర అనిమల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాములను పట్టుకునేందుకు అవసరమైన మెలకువలు, తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల నుంచి యాభైమంది విచ్చేశారు. పాములు పట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతలపై స్నేక్ రెస్క్యూ ట్రైనింగ్‌లో అవగాహన కల్పించారు. అలాగే పాములు కనిపించినప్పుడు ఎవరికి సమాచారం ఇవ్వాలి, ఎలా వాటిని పట్టుకోవాలి, పట్టుకున్న తర్వాత వాటిని ఎక్కడ వదిలిపెట్టాలి అన్న అంశాలను వివరించారు. తర్వాత ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వారికి జూ క్యూరేటర్ సెల్వం సర్టిఫికెట్లను, పాములను పట్టే కిట్లను అందజేశారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు, పాముల పట్టే కిట్లు అందజేస్తున్న జూ క్యూరేటర్ సెల్వం

సాగర మీనం..బతుకు బంగారం!


బోటును బయటకు లాగుతున్న మత్స్యకారులు

గంగపుత్రుల బతుకు జీవనం చిత్ర విచిత్రంగా ఉటోంది. గత కొన్ని నెలలుగా వరుస తుపాన్లు, ఈదురు గాలులతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఆ తర్వాత తుపాన్లు తగ్గినా మత్స్య సంపద చెల్లాచెదురైపోయింది. పొద్దుమొలవక ముందే సముద్రంలోకి వెళ్లి మళ్లీ పొద్దుగూకే వరకు వలలేసి దేవినా పట్టుమని పది కిలోలు కూడా పడకుండా వేధించింది. ఇప్పుడిప్పుడే మత్స్య సంపద ఆశించిన స్థాయిలో లభ్యమవుతుండడంతో మత్స్యకారుల మోములో సంతోషం వెల్లివిరిస్తోంది. దానికితోడు బర్డ్ ఫ్లూ కారణంగా చేపలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడడంతో ఆశించిన స్థాయిలో ఆదాయం కూడా వస్తోందని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – వాకాడు


విరివిగా దొరికిన మత్స్య సంపద


చేపలను విక్రయిస్తున్న జాలర్లు

కూటమికి కొమ్ముకాస్తే కష్టాలే!


మీడియాతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి (సైదాపురం) : ప్రజ సేవే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, కూటమి నేతలకు కొమ్ముకాస్తూ.. మౌఖిక ఆదేశాలను పాటిస్తే భవిష్యత్‌లో కష్టాలు తప్పవని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జేఆర్ భవనంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ పేదలకు న్యాయం చేయాలని, ఇబ్బంది పెట్టేలా వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను వేధిస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. తమ పార్టీ కార్యకర్త పేచీరాజ్‌పై అక్రమంగా గంజాయి కేసు బనాయించి జైలుపాలు చేశారని ఆరోపించారు. అయితే పేచీరాజ్ కేసును విచారించిన హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందని వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి సీసీ కెమెరాల ఫుటేజీ సమర్పించాలని పోలీసులను ఆదేశించిందని తెలిపారు. ఈ క్రమంలో అక్రమ కేసు నమోదు చేసిన పోలీసులు భవిష్యత్‌లో హైకోర్టుకు సమాధానం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని వివరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వెంకటగిరి సుందరీకరణకు 110 ఎకరాల్లో నగర వనం ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశామని, ప్రస్తుతం ఆ పనులు ఎక్కడి వరకు వచ్చాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. అలాగే శిలాఫలకం విషయంలో ప్రోటోకాల్ పాటించలేదని, దళిత ఎంపీ గురుమూర్తిని అవమానించేలా ఆయన పేరు లేకుండా చేశారని మండిపడ్డారు. అలాగే డిప్యూటీ సీఎంతోపాటు అటవీశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న పవన్ కల్యాణ్ పేరు ఎక్కడ ఉందో చెప్పాలని కోరారు. 2027లో జమిలి ఎన్నికలు రాబోతున్నాయని, వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం తథ్యమని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు పులి ప్రసాద్‌రెడ్డి, ఎస్.బాలయ్య, చిట్టేటి హరికృష్ణ, వెందోటి కార్తీక్‌రెడ్డి, చింతల శ్రీనివాసులరెడ్డి, ఆటంబాకం శ్రీనివాసులు, సుబ్బారావు, వహిదా, నేతలు అల్లంసాయి, పేచీరాజ్, దశరథరామిరెడ్డి, సతీష్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బండారుపల్లెలో విషాదం

- చెరువులో పడి అనుమానాస్పదంగా వ్యక్తి మృతి
- అంత్యక్రియలకు వస్తూ రోడ్డుప్రమాదంలో మిత్రుడి దుర్మరణం


మునిరత్నం మృతదేహం



రాజేష్‌నాయుడు(ఫైల్)

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం బండారుపల్లికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాలు.. అరగొండ మునిరత్నం(34)తో వెదురుకుప్పం మండలం వేంపేరికి చెందిన ఉషకు పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. కొయ్యపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మునిరత్నం మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య ఉష ఏడాది క్రితం గొడవపడి పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో భార్యాపిల్లలను చూసేందుకు బయలుదేరిన మునిరత్నం ఆదివారం మన్నసముద్రం చెరువులో మృతదేహమై కనిపించాడు. దీనిపై సమాచారం అందుకున్న ఏర్పేడు సీఐ జయచంద్ర ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కడసారి చూసేందుకు వస్తూ...:

బండారుపల్లెకు చెందిన మునిరత్నం, రాజేష్‌నాయుడు చిన్నప్పటి నుంచి స్నేహితులు. రాజేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు.. ఐదేళ్ల కిందట నెల్లూరు జిల్లా కావలి సమీపంలో కొయ్య బొమ్మలు పని చేసుకుంటూ అక్కడే నివాసముంటున్నాడు. మునిరత్నం మృతి చెందిన విషయం తెలియడంతో ద్విచక్ర వాహనంపై బండారుపల్లెకు వస్తూ రోడ్డు ప్రమాదంలో రాజేష్(33) మృతి చెందాడు. ప్రాణస్నేహితులిద్దరినీ మృత్యువు కబళించడంతో బండారుపల్లె వాసులు కన్నీరుమున్నీరయ్యారు.


బరిలో పరుగులు తీస్తున్న పోట్ల గిత్త


మాట్లాడుతున్న మంచు మనోజ్

కోడెగిత్తల జోరు

చంద్రగిరిలో ఆదివారం మిట్టమీద గంగమ్మ ఆలయ కమిటీ నేతృత్వంలో జోరుగా పరుష పందేలు నిర్వహించారు. పరుగులు తీసే ఎడ్లను వీక్షించేందుకు పెద్దసంఖ్యలో జనం తరలి వచ్చారు. మేడలు.. మిద్దెలపైకి ఎక్కి రంకెలేస్తున్న కోడెగిత్తలను చూసి కేరింతలు కొట్టారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు తమ అభిమాన నేతలతో కూడిన పలకలు కట్టి సుమారు 150 ఎడ్లను బరిలో దింపారు. ఈ మేరకు పెద్దసంఖ్యలో యువత ఉత్సాహంగా రంగంలోకి దిగారు. పోటెత్తిన పోట్ల గిత్తలను నిలువరించేందుకు దూసుకెళ్లారు. పలకలను చేజిక్కించుకునేందుకు పోటీపడ్డారు. ఈ క్రమంలో పందేలకు వస్తున్న పార్టీ అభిమానులను పోలీసులు అడ్డుకునేందుకు యత్నించడంపై స్థానికులు మండిపడ్డారు. ప్రధానంగా సీఐ సుబ్బరామిరెడ్డి ఓవర్‌యాక్షన్‌పై స్థానికులు విమర్శలు గుప్పించారు. – చంద్రగిరి


ఎలకలతో ర్యాలీగా వస్తున్న ఆర్ఆర్ బృందం


మిద్దెలెక్కిన జనం